క్లుప్తంగా

సప్తసోమవార ప్రదక్షిణలు


సప్త ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో సప్తసోమవారం ప్రదక్షిణల్లో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ప్రదోష కాలంలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించారు. రాత్రి పంచహారతులు కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పసుపులేటి వాసు, అర్చకులు కిష్టప్ప, అనిల్, వీరబాబులు పాల్గొన్నారు.

కాపు క్లబ్ అధ్యక్షుడిగా కానూరి


నూతన కమిటీని అభినందిస్తున్న సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణ యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా కానూరి ప్రభాకరరావు ఎంపికయ్యారు. ఆదివారం రాత్రి అడబాల గార్డెన్స్‌లో నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా కానూరి ప్రభాకరరావు, సెక్రటరీగా గుండుమోగుల వీరాస్వామి, ట్రెజరర్‌గా కొండ్రెడ్డి సూర్యనారాయణలు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్, గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు, క్లబ్ సభ్యులు జక్కంపూడి మదన్, వేరుకొండ దుర్గాప్రసాద్, పోకల రాము, జక్కంపూడి కుమార్, శిరిగినీడి నాగార్జున, కామిశెట్టి అయ్యప్ప నాయుడు, శిరిగినీడి రాజ్యలక్ష్మి, చేగొండి ప్రకాష్, వంగా నరసింహరావు పాల్గొన్నారు.

అమ్మవారికి విశేష పూజలు

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు గ్రామంలో వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం నందు శ్రీ ఆండాళ్(గోదా) అమ్మవారి తిరునక్షత్రం సందర్భంగా అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి తిరుప్పావై సేవా కాలం, అష్టోత్తర తులసీదళార్చన, నీరాజన మంత్రపుష్పములు, తీర్థ గోష్ఠి, ప్రసాద వినియోగం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తుల పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గోదాదేవి కల్యాణం

ఆకివీడు: మండలంలో గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు శేషాచార్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డుపై పడి వ్యక్తి మృతి

పాలకొల్లు సెంట్రల్: టీ తాగడానికి వచ్చి రోడ్డుపై పడిన సంఘటనలో రావూరి శ్రీనివాస్ (38) అనే వ్యక్తి మృతి చెందాడు. సోమవారం పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ... యలమంచిలి మండలంలోని అడవిపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాస్ శనివారం పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌కు వచ్చాడు. బస్టాండ్ నుంచి వెళ్తూ పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే ఆర్టీసీ సిబ్బంది 108కు సమాచారం అందజేసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి బయటకు వచ్చిన శ్రీనివాస్ సోమవారం ఉదయం టీ తాగడానికి దేశాలమ్మ ఆలయం వద్ద ఉన్న ఓ టీ స్టాల్ వద్దకు వస్తుండగా రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు వెంటనే 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. శ్రీనివాస్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. భార్య కనకమహాలక్ష్మి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మార్‌లింగం తెలిపారు.

ఖాళీ స్థలాల్లో దుర్గంధం

- ప్రజలకు వ్యాధుల భయం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

నరసాపురం: పట్టణంలో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల నుంచి దుర్గంధం వెదజల్లుతోంది. సదరు యజమానులు తమ స్థలాలకు సరైన రక్షణ చర్యలు చేపట్టక పోవడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకు పోయి, దోమలు విజృంభిస్తున్నాయి. స్టేషన్‌పేట, రుస్తుబాద, రాయిపేట, హౌసింగ్ బోర్డు కాలనీ, చలువ పేట, ఎన్టీఆర్ కాలనీ, వీవర్స్ కాలనీ, నందమూరి కాలనీ, చిన మామిడిపల్లి ప్రాంతాల్లో ఎక్కువగా ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఈ స్థలాలన్నీ ఇళ్ల మధ్యే ఉండటం, వాటిలో పిచ్చి మొక్కలు పెరిగి, చెత్తా చెదారం చేరి, దోమలకు ఆలవాలంగా మారడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షపు నీరు ఈ స్థలాల్లో నిల్వ ఉండి మొలిచిన పిచ్చి మొక్కలు, గడ్డి కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ప్రస్తుతం వర్షాలు పడటంతో ఖాళీ స్థలాల వద్ద పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఫలితంగా స్థానికులు రోగాల భారిన పడుతున్నారు. ఖాళీ స్థలాల వద్ద ప్రజలు ముక్కుమూసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైఎస్సార్ కాలనీ శివారు ఆదర్శ్ కాలనీ వద్ద, ఎన్టీఆర్ కాలనీ వద్ద ఈ పరిస్థితిని నెలకొంది.


రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న ఖాళీ స్థలంలో పెరిగిన పచ్చగడ్డి

250 వరకు ఖాళీ స్థలాలు

పట్టణంలో ఖాళీ స్థలాలను గుర్తించి, వాటిని పూర్తి స్థాయిలో శుభ్రంగా ఉండేలా మున్సిపల్ అధికారులు నిరంతరం చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా శానిటరీ అధికారులు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టడం లేదు. దీంతో సమస్య తీవ్రరూపం దాల్చుతోంది. పట్టణంలో మొత్తంగా 250 వరకు ఇలాంటి ఖాళీ స్థలాలు వివిధ ప్రాంతాల్లో ఉన్నట్టు అంచనా. చాలా స్థలాలకు సంబంధించి మున్సిపాల్టీకి పన్నులు కూడా చెల్లించడంలేదని చెబుతున్నారు. ఓ వైపు మున్సిపాల్టీ ఆదాయం కోల్పోతుండగా, మరో వైపు అపారిశుధ్యంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం



పట్టణంలో పారిశుధ్య ఇబ్బందులు తలపెడుతున్న ఖాళీ స్థలాల విషయంలో చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఇలాంటి స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చాం. ఖాళీ స్థలాల్లో బోర్డులు పెట్టాలని నిర్ణయించాం. వర్షాకాలం దృష్ట్యా ప్రస్తుతం ఈ అంశంపై మళ్లీ దృష్టి పెడతాం. ఖాళీ స్థలాల యజమానులు ఇప్పటికైనా తమతమ స్థలాలను బాగుచేసుకోవాలి. చుట్టుపక్కల వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేస్తాం.

– ఎం అంజయ్య, మున్సిపల్ కమిషనర్

రేపు కౌన్సిల్ సమావేశం

నరసాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకట రమణ తెలిపారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని, సభ్యులు విధిగా హాజరుకావాలని పేర్కొన్నారు.

జూదరుల అరెస్ట్

యలమంచిలి: శిరగాలపల్లి గ్రామంలోని అరుంధతీపేటలో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను సోమవారం అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్సై కె.గుర్రయ్య తెలిపారు. వారి నుంచి రూ.3950 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

లంకలకోడేరులో ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపు


సదస్సులో పాల్గొన్న డాక్టర్ రాజ్‌కుమార్

పాలకొల్లు సెంట్రల్: వైద్య సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్‌పై అవగాహన కల్పించాలని జిల్లా ఎఫ్‌పీసీ, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని లంకలకోడేరు గ్రామంలో లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పర్యటించి ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపులు నిర్వహించి బీపీ, షుగర్, ఇతర వ్యాధులకు పరీక్షలు నిర్వహించాలన్నారు. సీడీఎన్‌సీడీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. డాక్టర్ నవ్య జీవన్ మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో ఉన్న సిబ్బంది అందరూ తమకు ఇచ్చినటువంటి టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఎలిజిబెత్, ఎస్‌కే అమలేశ్వరరావు, జి.ఉదయ్ చందర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా పరిష్కార వేదికకు రెండు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ మార్కండేయేశ్వరరావు సోమవారం తెలిపారు. దుంపగడపలోని ఉప్పుటేరు గట్టు వద్ద రోడ్డును పూడ్చివేసి మంచినీటి పైపులైన్‌కు అవరోధం కల్గిస్తున్నారని ఆ ప్రాంతానికి చెందిన తమ్ము నాగరాజు, స్థానికంగా నివశిస్తున్న అక్బర్ ఆలీ తన రేషన్ కార్డును పునరుద్ధరించాలని ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

'లయన్స్' ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు


మొక్కలు పంపిణీ చేస్తున్న లయన్స్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం పలుసేవా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు 300 మొక్కల పంపిణీ, ఆలయానికి వీల్ చైర్ బహూకరణ, అంజలి మానసిక పాఠశాలలో విద్యార్థులకు పౌష్టికాహారం అందజేత, పలుచోట్ల ఉచిత వైద్య శిబిరాలు, ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ల పంపిణీ, బ్లడ్ బ్యాంకులో రక్తదానం వంటి కార్యక్రమాలు చేశారు. లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి, ప్రస్తుత జిల్లా గవర్నర్ ఎన్ పాపారావునాయుడు, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా వైఎస్సార్ సీపీ

పార్టీ రాష్ట్ర కార్యదర్శి మేడపాటి

పెనుగొండ: రాష్ట్రంలో ప్రజలు చంద్రబాబుకు మోసపోయారని, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అండగా ఉండి ఐక్యంగా పోరాటం చేద్దామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పెనుగొండలోని రెడ్డి కల్యాణ మండపంలో బాబూ ష్యూరిటీ – మోసం గ్యారెంటీ మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ప్రజలు మరో సారి చంద్రబాబు మోసానికి గురయ్యారని ఆయన అన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇది మూడో సారన్నారు. ప్రతి సారీ ప్రజలు మోసపోవడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ప్రస్తుతం ప్రజలు చంద్రబాబు మోసాన్ని గ్రహించారన్నారు. వంచించి అధికారంలోకి వచ్చి ఖజానా ఖాళీ అంటూ కల్లబొల్లి కబుర్ల చంద్రబాబుకు ప్రజలు పట్టం కడితే రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించాల్సిన వ్యక్తి అధికారంలోకి రాగానే మౌనంగా ఉంటున్నారని ఆరోపించారు.

సంక్షేమం మరిచి, వనరులు దోచుకుంటూ..

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దంపనబోయిన బాబూరావు మాట్లాడుతూ సంపద సృష్టించి తీరుతానని, సంక్షేమాన్ని అమలు చేస్తానని చెప్పిన 40 ఏళ్ల అనుభవం ఉన్న చంద్రబాబు నేడు సంక్షేమం అమలు మరిచి, గత సంక్షేమాన్ని తుంగలో తొక్కుతున్నారని దుయ్యబట్టారు. ఇంటింటికీ రేషన్ నిలిపివేశారని, ఫీజు రీఎంబర్స్ మెంట్, ఆరోగ్య శ్రీ గురించి మరచి పోయారని వాపోయారు. సీఎం నుంచి దిగువస్థాయి కార్యకర్త వరకూ కూటమి నాయకులు రాష్ట్ర వనరులను దోచుకొంటున్నారన్నారు. ఇసుక దోపిడి నియోజవర్గంలో దారుణంగా ఉందన్నారు. దీనిని నిలవరించి, ప్రజలకు అండగా ఉందామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద), వైస్ ఎంపీపీ తోలేటి శ్రీను, మండల కన్వీనరు నల్లిమిల్లి వేణుప్రతాపరెడ్డి (బాబీరెడ్డి), రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు చిన్నం రామిరెడ్డి, రాష్ట్ర నాయకులు పోడూరి రామయ్య, ఉన్నమట్ల మునిబాబు, మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల కన్వీనరు పలివెల శ్రీను, బీసీ సెల్ అధ్యక్షుడు కాసాని శ్రీను, సచివాలయ మండల కన్వీనర్ సాకా సుబ్రహ్మణ్యం, పట్టణ అధ్యక్షుడు తిక్క రెడ్డి పవన్‌కుమార్, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కొనుకు శ్రీనివాసరావు (జెంట్రీ), జిల్లా కమిటీ సభ్యుడు సుంకర నాగబాబు, ఎంపీటీసీల కన్వీనర్ చిన్నం ఏడుకొండలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బాబూ ష్యూరిటీ మోసం గ్యారెంటీపై నిర్వహిస్తున్న సమావేశం

మున్సిపల్ వాటర్ అమ్మకంపై ఫిర్యాదు

నరసాపురం: కుళాయిల ద్వారా మున్సిపాలిటీ సరఫరా చేసే మంచినీటిని అక్రమంగా తన ప్రైవేట్ ట్యాంకర్లలో పట్టి విక్రయిస్తున్న నరసాపురం 30వ వార్డు జవదాలపేటకు చెందిన బందారు సుబ్బారావుపై చర్యలు తీసుకోవాలని స్థానిక వార్డు కౌన్సిలర్ అడిదల శరత్ ఫిర్యాదు చేశారు. సోమవారం నరసాపురం ఆర్డీఓ దాసి రాజును కలిసి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. స్థానికులు ఈ అక్రమ దందాను ఆపి మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారని, అయితే అధికారులు అతనిపై చర్యలు తీసుకోకపోగా, ట్యాంకర్‌ను కూడా వదిలేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేయిస్తానని ఆర్డీఓ హామీ ఇచ్చినట్టు శరత్ చెప్పారు. ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 47 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీఓ తెలిపారు. ఈ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.


ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

పెనుగొండ: స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు కేతా గోపాలన్ అన్నారు. స్మార్ట్ విద్యుత్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ పెనుగొండ మండల కేంద్రంలో ప్రచారం చేశారు. పార్టీ పెనుగొండ కార్యాలయం నుంచి పెనుగొండ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. స్మార్ట్ మీటర్లు బిగించడానికి ఎవరైనా వస్తే తిరస్కరించాలని ప్రజలకు సూచించారు. ముందుగానే డబ్బు చెల్లించి విద్యుత్ రీచార్జి చేయించుకోవడంపై విమర్శిస్తూ అధికారంలోకి వస్తే చార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని చెప్పిన కూటమి పార్టీలు నేడు ఆ హామీలను తుంగలోకి తొక్కాయని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లు పగలగొట్టండని, చెప్పిన లోకేష్ ఇప్పుడు మౌనం వహించారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎస్ వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి షేక్ పాదుషా, గ్రామ కార్యదర్శి నాగిశెట్టి గంగారావు, మాదాసు నాగేశ్వరరావు, గుడిమెట్ల వరహాల్ రెడ్డి, కుడిపూడి గోపాలకష్ణ, పాల ఏడుకొండలు, తాతయ్య, తదితరులు పాల్గొన్నారు.


పెనుగొండలో ప్రచారం చేస్తున్న నాయకులు

నిర్మాణ కార్మికుల సమస్యలపై వినతి

పాలకొల్లు సెంట్రల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం శ్రీ వేంకటేశ్వర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో ఏఎస్‌ఓ సుధాకరరావుకు వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును క్రియాశీలం చేసి పటిష్ట చేయాలని, వెల్‌బోర్డులో కార్మికుల నమోదు ప్రక్రియను సులభతరం చేయాలి, వార్డు గ్రామ సచివాలయాల్లో నమోదు చేయడానికి అవకాశం కల్పించాలని కోరారు. వెల్‌ఫేర్ సెస్‌ను ఐదు శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న అన్ని క్లెయిమ్‌లను పరిష్కరించాలని, వెల్‌ఫేర్ బోర్డులో నమోదయిన కార్మికులకు వెంటనే గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ప్రమాదాలు, అనారోగ్యాల కారణంలో మంచాన పడ్డ కార్మికులకు వెల్‌ఫేర్ బోర్డు ద్వారా ఈఎస్‌ఐ తరహాలో ఉచిత వైద్య సహాయం కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు పెచ్చెట్టి వెంకట కృష్ణారావు మాట్లాడుతూ గౌరవ అధ్యక్షుడు పులపర్తి సర్వేశ్వరరావు, యూనియర్ కార్యదర్శి అడబాల శ్రీరామకృష్ణ, ట్రెజరర్ మైలవరపు శ్రీరామ్‌బాబు, గూడవల్లి మారుతి, పిడపర్తి సత్యం, రాజా భక్త తుకారాం, ముంగండ ఆదినారాయణ, చినిమిల్లి సుబ్రహ్మణ్యం, అబ్బిరెడ్డి నగేష్‌బాబు, ముత్యాల సుబ్బారావు, జీకేఎస్ రావు, ఆకుల సత్యనారాయణ, బండి ఆంజనేయులు, మల్లాల వెంకటేశ్వరరావు, రామర్తి చిన్న శ్రీను,యాతం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఏఎస్‌ఓ సుధాకరరావుకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

కంటి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

భీమవరం: యువత కంటి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని స్థానిక నేత్ర వైద్యుడు యుపీ రమణరాజు అన్నారు. స్థానిక ఆర్‌ఆర్‌డిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల యూత్ రెడ్ క్రాస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర పరీక్షా శిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే వయస్సులో నయనేంద్రియం సంరక్షణ, ప్రాధాన్యత కలిగిన ముఖ్యాంశామని, విద్యార్థులు స్పష్టమైన చూపుతో అధ్యయనం చేసి బంగారు భవిష్యత్తు సొంతం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ వికేజె ప్రసూన మాట్లాడుతూ ఎంతోమంది అంధ విద్యార్థులను చదివిస్తూ రమణరాజు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ అరవిందస్వామి, యూత్ రెడ్ క్రాస్ కన్వీనర్ కాకుమాని శ్రీనివాసరావు, డివివిసిహెచ్ సత్యనారాయణ, జిప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.


కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

వ్యాసరచన పోటీలు

భీమవరం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు సోమవారం చెప్పారు. గాంధీజీ ఆశించిన సురాజ్యం నేటి పరిస్థితులు అనే అంశంపై తెలుగులో రెండు పేజీలకు మించకుండా రాసిని వ్యాసాన్ని ఆగస్టు 11లోపు కార్యదర్శి జిల్లా సర్వోదయ మండలి, గాంధీకస్తూరీ బా భవనం శ్రీరామపురం, భీమవరం–2 అనే చిరునామాకు పంపించాలన్నారు. హెచ్‌ఎం, ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అన్నారు.

పుష్కరాల వరకు ఆగాల్సిందేనా?

- ఔననే అంటున్న అధికారులు!
- ముందుకు కదలని నవరసపురం రోడ్డు పనులు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు


అధ్వానంగా తయారైన నవరసపురం రోడ్డు

నరసాపురం రూరల్: నరసాపురం, యలమంచిలి మండలాలను కలిపే నవరసపురం రోడ్డు పెద్ద, పెద్ద గోతులతో అధ్వానంగా తయారైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినప్పటికీ ఈ రోడ్డు విస్తరణ పనులు కదల్లేదు. ఎన్నికల ముందు రోడ్డు పరిస్థితిని ప్రభుత్వానికి తెలియజెప్పేందుకు టీడీపీ నరసాపురం ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు ఆయా గ్రామాల ప్రజలతో పాదయాత్ర నిర్వహించారు. ఆయన మంత్రులు, ఉన్నతాధికారులకు అప్పుడప్పుడు వినతి పత్రాలు ఇస్తూ ప్రచార ఆర్భాటం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. 2027లో జరిగే గోదావరి పుష్కర పనుల్లో భాగంగా ఈ రోడ్డు పనులు కూడా పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ కార్యాలయానికి వెళ్లిన వారికి అధికారులు సమాధానం ఇస్తున్నట్టు తెలిసింది. ఇంకా రెండేళ్ల వరకు రాకపోకలకు ఇబ్బందులు పడాల్సిందేనా అని ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. నిధులు విడుదల చేస్తే ఈ లోపే మరమ్మతులు చేస్తామని అధికారులు చెబుతున్నారని నవరసపురం గ్రామ ప్రజలు వాపోతున్నారు. యలమంచిలి, నరసాపురం మండలాలకు చెందిన బాడవ, ఏనుగువానిలంక, పాత, కొత్తనవసపురం గ్రామాల ప్రజలు నిత్యం నరసాపురం వచ్చి తమ అవసరాలు తీర్చుకోవాల్సిందే. స్కూలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా పాడైన ఈ రోడ్డుపై ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తక్షణం రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ముదునూరి హయాంలో నిధులు

నవరసపురం రోడ్డు ప్రాధాన్యతను గుర్తించిన నాటి ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు నరసాపురం – పాలకొల్లు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి కొత్త నవరసపురం, పాత నవరసపురం గ్రామాల మీదుగా మేడపాడు వరకు 15 కిలో మీటర్ల మేర రోడ్డు విస్తరణకు ఎన్‌డీబీ నిధులు రూ.40 కోట్లు మంజూరు చేయించారు. రూ.3 కోట్ల వ్యయంతో నవరసపురం, యలమంచిలి గ్రామాల్లో విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు వెంబడి పంట కాలువకు రక్షణ గోడ నిర్మించారు. రోడ్డు విస్తరణ వల్ల భూములు కోల్పోయే రైతులు, గృహ యజమానులకు రూ.7 కోట్లు చెల్లించేందుకు నిధులు విడుదలయ్యాయి. అయితే కొత్త నవరసపురం గ్రామస్తులు రోడ్డు విస్తరణకు సానుకూలంగా లేకపోవడంతో విస్తరణ పనులు ఆగిపోయాయి. ఈ లోపుగా సాధారణ ఎన్నికలు రావడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి.